## నూతన కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్




కామారెడ్డి,జూన్ 15: జిల్లా నూతన కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జితేశ్ వీ పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆశిష్ సంగ్వాన్ స్వస్థలం హర్యానా రాష్ట్రంలోని భివాని. అమెరికాలోని జార్జియా టెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ చేసిన అనంతరం 2015లో జరిగిన సర్వీసెస్ పరీక్షలో 12వ ర్యాంకు సాధించారు. 2023 అక్టోబర్ నుంచి నిర్మల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సంగ్వాన్‌ను కామారెడ్డి కలెక్టర్‌గా నియమించారు. ఆయన భార్య కూడా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ క్రాంతి వల్లూరు. ప్రస్తుతం ఈమె సంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న తిమ్మక్‌పల్లి రైతులు



# కరెంటు కోసం రోడ్డెక్కిన రైతన్న

- విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా
- మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టిన అన్నదాతలు



కామారెడ్డి,జూన్ 15: పొలాల వద్ద మోటర్లకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వహించడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. మూడు నెలల క్రితం డీడీలు కట్టినా పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తిమ్మక్‌పల్లి గ్రామ రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడు నెలల క్రితం వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్లను కేటాయించలేదన్నారు.గద్దెలు కట్టారు తప్పా.. ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించలేదని అన్నారు. వర్షాలు కురిస్తే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ఇబ్బందులవుతాయని, తమ గ్రామంలోనూ విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నదని అన్నారు. పొలాలకు కరెంట్ లేకపోవడంతో వరి తుకం ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని వివరించారు. ఏ అధికారి వద్దకు వెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కొంతమంది ఇప్పటి వరకు తుకం వేయలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రైతులకు కష్టాలు అధికమయ్యాయని ఆరోపించారు. విద్యుత్ అధికారులు వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని మెదక్-కామారెడ్డి ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటలకు పైగా బైటాయించి రైతులు నిరసన తెలిపారు. ఇరు వైపులా ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



రైతులను సముదాయిస్తున్న పోలీసులు

### డీడీలు కట్టి మూడు నెలలు అయ్యింది..



వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టి మూడు నెలలు అవుతుంది. అయినా కూడా అధికారులు ఇప్పటి వరకు స్పందించలేదు. కనీసం ఇక్కడికి వచ్చి మా సమస్యలను పరిష్కరించలేదు. మాకు పరిహారం చెల్లించాలి.

**- రాజయ్య,రైతు, తిమ్మక్‌పల్లి**

### తుకం ఎండిపోతున్నది..



మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీ కట్టినప్పటికీ అధికారులు స్పందించడం లేదు. కరెంట్ లేకపోవడంతో వరి తుకం ఎండిపోయే పరిస్థితి ఉన్నది. ఇకనైనా అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

**-నారాయణ, రైతు, తిమ్మక్‌పల్లి**

### ఏ నాయకుడూ పట్టించుకోవడం లేదు



బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకునే వారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ నాయకుడూ మా బాధను పట్టించుకోవడం లేదు.ట్రాన్స్‌ఫార్మర్లు లేక చాలా మంది రైతులు ఇబ్బందిపడుతున్నారు.అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు.

**-విజయ్‌కుమార్, తిమ్మక్‌పల్లి**



## నవీపేట మేకల సంత @ రూ.4కోట్లు

**నిజామాబాద్** జిల్లా నవీపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మేకల సంతలో రికార్డు స్థాయిలో జీవాల క్రయవిక్రయాలు జరిగాయి. బక్రీద్ పండుగను పురస్కరించుకొని తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వ్యాపారులు, ప్రజలు జీవాల కొనుగోలుకు పోటీపడ్డారు. ఒక్కరోజే రూ.4కోట్లకు పైగా మేకలు, గొర్రెల క్రయవిక్రయాలు జరిగినట్లు పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. ఒక్కో మేక పొట్టేలు రూ. 15 వేల నుంచి రూ.18వేల వరకు ధర పలికింది. కొనుగోలు, విక్రయదారులతో నవీపేట మొత్తం సందడి వాతావరణం నెలకొన్నది.

*-నవీపేట, జూన్ 15*

### సాటాపూర్‌లో సందడి

రెంజల్, జూన్ 15: రెంజల్ మండలంలోని సాటాపూర్ పశువుల సంతలో శనివారం సందడి వాతావరణం నెలకొన్నది. 17న బక్రీద్ సందర్భంగా పశువుల కొనుగోళ్లకు డిమాండ్ పెరిగింది. సంతకు ఆశించిన స్థాయిలో కంకలు రాలేదు. మహారాష్ట్రలోని నాందెడ్ పట్టణానికి చెందిన వ్యాపారి రూ.లక్షా80వేలకు ఓ కంకను కొనుగోలు చేశాడు. పశువుల కొనుగోళ్లకు అనుమతిపత్రాలు తప్పనిసరి కావడంతో వ్యాపారులు గ్రామ పంచాయతీ వద్ద పెద్ద ఎత్తున బారులుతీరారు. బోధన్ రూరల్ సీఐ నరేశ్‌కుమార్, ఎస్సై సాయన్న బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కొట్టి చంపారు..

- భర్తను చంపిన భార్య, కుమారుడు, మామ?
- సాతెల్లిలో దారుణం

## భూమి కోసం ప్రాణం తీసిన వైనం

ఎల్లారెడ్డి, జూన్ 15: కుటుంబ తగాదాలతో ఒకరు దారుణహత్యకు గురయ్యారు. ఆస్తి కోసం సొంత కుటుంబీకులే హత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సాతెల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సాతెల్లికి చెందిన కుర్మ దుర్గయ్య (35)కు అదే గ్రామానికి చెందిన లక్ష్మితో కొన్నేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే, దంపతుల మధ్య తరచూ తగాదాలు జరుగుతుండడంతో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ కూడా జరిగింది. చాలా రోజుల నుంచి భార్యాభర్తలు విడివిడిగానే ఉంటున్నారు. పెద్దల సూచన మేరకు ఉన్న నాలుగు ఎకరాల భూమిలోనుంచి ఎకరం కుమారుడికి ఇవ్వాలని చెప్పగా, దుర్గయ్య సరే అన్నాడు. అయితే, ఉన్న నాలుగు ఎకరాలు భార్య ఆధీనంలోకి తీసుకుని సాగు చేసుకుంటున్నది. తనకు భూమి లేకపోతే ఎలా బతికేదని భావించిన దుర్గయ్య మూడు రోజుల క్రితం పొలం వద్దకు వెళ్లి ఎకరం భూమిని దున్నాడు. శనివారం ఉదయం మరోమారు పొలం వద్దకు వెళ్లగా, భార్య లక్ష్మి, కుమారుడితో పాటు మామ సాయిలు గొడవకు దిగారు. ముగ్గురు కలిసి అతడ్ని తీవ్రంగా చితకబాదారు. అనంతరం అతడ్ని ఇంటికి తీసుకొచ్చి ఇంట్లో పడేసి గడియ పెట్టి వెళ్లిపోయారు. ఇది గమనించిన స్థానికులు 100, 108కు కాల్ చేసి సమాచారమిచ్చారు. దీంతో 108 సిబ్బంది వచ్చి దుర్గయ్యను ఎల్లారెడ్డి దవాఖానకు తరలించగా, పరిశీలించిన వైద్యులు కామారెడ్డి దవాఖానకు తీసుకెళ్లాలని సూచించారు. పరిస్థితి విషమించడంతో కామారెడ్డికి వెళ్లేలోపే అతడు మృతి చెందాడు. భార్య లక్ష్మి, కుమారుడు, మామ కుర్మ సాయిలు కొట్టడంతోనే తన తమ్ముడు మృతి చెందాడని దుర్గయ్య సోదరుడు కాశయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.





























